సాక్షి నిర్మల్

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ముగిసిన హనుమాన్ జాతర

తానూరు మండలం బోరిగాం హనుమాన్ ఆలయంలో కొనసాగుతున్న జాతరోత్సవాలు ముగిశాయి. భక్తులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸



మంత్రి జూపల్లిని కలిసిన బొజ్జు

ఖానాపూర్: పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

గరిష్టం/కనిష్టం
29.0 / 17.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. వేకువజామున పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ డిపోలో ఆరోగ్యకేంద్రం



అవార్డులు స్వీకరించిన డ్రైవర్లు, కండక్టర్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపోలో ఆర్ఎం సాలోమాన్, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డితో కలిసి ఆరోగ్యం కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కండక్టర్, డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ మనుగడ సాధిస్తుందని చెప్పారు. వారి కోసమే ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతిచక్ర అవార్డులు ప్రదానం చేశారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



గంగాధర్

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు యూ గంగాధర్ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు రిటైర్డ్ ప్రొఫెసర్ పీ నర్సింహారావు పర్యవేక్షణలో 'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ల్యాండ్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ తెలంగాణ- ఏ స్టడీ ఆఫ్ ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్‌తోపాటు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉపసర్పంచ్ చెక్‌పవర్ రద్దు



దశరథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఈవోపీఆర్డీ

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ చెక్‌పవర్ రద్దు చేసినట్లు ఈవోపీఆర్డీ ఉపేందర్ తెలిపారు. కొంతకాలంగా వివిధ అభివృద్ధి పనుల చెక్కులపై సంతకాలు పెట్టేందుకు ఉపసర్పంచ్ ఇబ్బందులు పెడుతున్నందున డీపీవో ఆదేశాల మేరకు చెక్‌పవర్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా వార్డు సభ్యుడు బానవత్ దశరథ్‌కు చెక్‌పవర్ అప్పగించారు. సర్పంచ్ జడ రాజమణిఇందూర్, పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్, వార్డు సభ్యులున్నారు.

నేడు ఆండాలమ్మ పల్లకి సేవ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట ఆలయంలో ఈనెల 22వ తేదీన ఆండాలమ్మ పల్లకి సేవ, కుంకుమార్చన, 23వ తేదీన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు.

నిధులు కేటాయించండి



ఆర్‌అండ్‌బీ సీఈతో ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో ఆర్ అండ్‌బీ రోడ్లకు నిధులు కేటాయించి పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ ఆ శాఖ సీఈ (చీఫ్ ఇంజినీర్) మోహన్‌నాయక్‌ను కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు రోడ్ల ప్రతిపాదనలు ఆయనకు వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఈ నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, నాయకులు సాప్లి రమేశ్, సోలంకి భీంరావ్, పండిత్‌రావ్, రజాక్ ఉన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి టోర్నీ

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్ బాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ రమణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి బాల, బాలికలు పోటీల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కోటి ఆశలతో..

- ఉద్యోగాల కోసం నిరుద్యోగుల నిరీక్షణ
- శాసనసభలో మెగా డీఎస్సీ ప్రస్తావన
- గవర్నర్ తమిళిసై ప్రసంగంపై ఆశలు
- గత నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు
- భర్తీ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం!



బుధవారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

నిర్మల్ ఖిల్లా: రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వంపై జిల్లాలోని నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల శాసనసభలో గవర్నర్ ప్రసంగంలో మెగా డీఎస్సీ ప్రస్తావన రాగా, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఆశలు చిగురుస్తున్నాయి. గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినా జిల్లాలో ఖాళీలు స్వల్పంగానే ఉన్నాయి. కొన్ని సబ్జెక్టుల్లో ఒకట్రెండు పోస్టులు కూడా లేవు. కేటగిరీల వారీగా విభజిస్తే ఖాళీల సంఖ్య అతి స్వల్పంగా ఉండగా నిరుద్యోగులు నిరాశకు గురయ్యారు. అయితే ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ ప్రకటన జారీ చేస్తామని, భారీ మొత్తంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని నేతలు హామీ ఇచ్చారు. శాసనమండలిలోనూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగాల భర్తీ దిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ ద్వారా జిల్లాలో ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. 2017లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి 8,792 పోస్టులు భర్తీ చేసింది. అప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వారీగా నియామకాలు పూర్తి చేశారు. అయితే ప్రస్తుతం నూతన జిల్లాలుగా విభజన చేసిన అనంతరం ఇదే తొలి డీఎస్సీ కానుండడంతో పోస్టుల భర్తీకోసం నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు వెలువడిన నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి డీఎస్సీ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గత నోటిఫికేషన్ ఖాళీలు ఇలా..

ఎన్నికలకు ముందు వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 115 పోస్టులు మాత్రమే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5,089 పోస్టులు ఉండగా జిల్లాకు 115 పోస్టులే ఉండగా అభ్యర్థులు నిరాశకు లోనవుతున్నారు. వీటిలో 91 ఎస్జీటీ పోస్టులుండగా.. 16 స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులు కలిపి ఉన్నాయి. భాషా పండితులు-4 పీఈటీలు-4 ఖాళీలు చూపించారు.

ప్రమోషన్లిస్తే మరిన్ని ఖాళీలు

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇస్తే క్షేత్రస్థాయిలోని ఎస్జీటీ పోస్టుల్లో ఖాళీలు మరిన్ని ఏర్పడే అవకాశాలున్నాయి. గతంలో మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు 461 ఉండగా ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు పెరిగే అవకాశాలున్నాయని నిరుద్యోగ అభ్యర్థులు అంటున్నారు. కోర్టు చిక్కులను పరిష్కరించి ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖాళీలు పెంచాలంటున్న అభ్యర్థులు

జిల్లాలో ఇంతతక్కువ సంఖ్యలో పోస్టులు ఉంటే ఎలా.. అని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు గతంలో వెలువరించిన నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని కోరుతున్నారు. ఈ నోటిఫికేషన్‌లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ తదితర టీచర్ల ఖాళీలు గతంలో ఉన్న వాటికంటే పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. ఇదే అంశంపై జిల్లాకు చెందిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు డీఈవో కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. కాగా, ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా ప్రమోషన్లు ఇవ్వగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులూ ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే క్రమంలోనే కోర్టు కేసుల వివాదంతో ప్రమోషన్ల ప్రక్రియ ఆగింది. అయితే టెట్ అర్హత ఉన్నవారే స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లకు అర్హులని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించగా ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ అవాంతరాలను అధిగమించి డీఎస్సీ నోటిఫికేషన్ త్వరగా జారీ చేయాలని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న



ఐదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న. గత ఎన్నికలకు ముందు జారీ చేసిన నోటిఫికేషన్ల పోస్టుల సంఖ్య అతి స్వల్పంగా ఉంది. ఇదే నోటిఫికేషన్‌కు అనుబంధం మరో నోటిఫికేషన్ జారీ చేసి పోస్టుల సంఖ్య పెంచాలి. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలు కూడా బలోపేతమవుతాయి.

– ఆడెపు సునీల్‌కుమార్, డీఎడ్ అభ్యర్థి, నిర్మల్

పోస్టుల సంఖ్య పెంచాలి



జిల్లాలో ఎస్జీటీలతో పాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీల సంఖ్య కూడా పెంచి డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. సాధ్యమైనంత తొందరగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి. జిల్లాలో నాలాంటి వేలాదిమంది నిరుద్యోగులు ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

– దొడ రమేశ్ ముదిరాజ్, సారంగపూర్

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: విధులను నిర్లక్ష్యం చేస్తున్న నర్సాపూర్(జీ) ఎస్సైపై చర్య తీసుకోవాలని గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, జనసేన నాయకులు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో, ఎస్పీకి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 25న సాయంత్రం 6గంటలకు నర్సాపూర్ మండలం చాక్‌పల్లి వద్ద తూరాటి గ్రామానికి చెందిన గున్నాల సాయమ్మ గుర్తుతెలియని వాహనం ఢీకొని చనిపోగా ఇప్పటిదాకా ఆ వాహనాన్ని గుర్తించలేదని తెలిపారు. సీసీ కెమెరాలున్నప్పటికీ ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే వాహనాన్ని గుర్తించి దోషులపై కేసులు నమోదు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు సుంకెట మహేశ్‌బాబు, బాధితుడు గున్నాల సదానందు పాల్గొన్నారు.

రూం టు రీడ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడెం: రూం టు రీడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం జిల్లా ఇన్‌చార్జి గోనె రవి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ పుస్తకాల వినియోగం–నిర్వహణ అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. తొలిమెట్టులో భాగంగా గ్రంథాలయాల పుస్తకాలు ఎలా వినియోగించాలి.. వాటిని ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మార్చుకునే తీరుపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందికి పుస్తకాలు అందజేశారు. లింగాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు కే శ్రీనివాస్, సంధ్య, శోభారాణి తదితరులున్నారు.

విద్యుత్ బకాయిలు రూ.39.54 కోట్లు

- గృహ వినియోగదారులవే అధికం
- వసూళ్లలో ఉద్యోగులకు ఇబ్బంది



భైంసాటౌన్: భైంసా సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ రూ.కోట్లలోనే బకాయిలున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా, నిర్వహణ ఆ శాఖకు భారంగా మారుతోంది. గృహ వినియోగ కనెక్షన్లకు సంబంధించి అధిక బకాయిలుండగా, ఆ తరువాతి స్థానంలో పట్టణంతోపాటు గ్రామాల్లో వీధి దీపాలు, బోరు మోటార్లు, ఇతర కనెక్షన్లకు సంబంధించి బకాయిలున్నాయి. దీంతోపాటు పలు వాణిజ్య సర్వీసుల బకాయిలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మూడునెలల కంటే ఎక్కువ బిల్లు బకాయి ఉన్న సర్వీసులకు సరఫరా నిలిపేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, విద్యుత్ సరఫరా నిలిపేసిన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో వినియోగదారుల నుంచి సిబ్బందికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మంగళవారం కుంట ప్రాంతంలో విద్యుత్ బకాయిల వసూలుకు వెళ్లిన సిబ్బందిపై ఓ వ్యక్తి దాడికి యత్నించిన విషయం తెలిసిందే. దీంతో ఇలాంటి ఘటనలు ఎదురైతే విధులు నిర్వహించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

33శాతం మొండి బకాయిలే..

భైంసా డివిజన్ పరిధిలో అన్ని కేటగిరీలు కలిపి మొత్తం 1,26,406 విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 16,149 కనెక్షన్లను (బిల్ స్టాప్) మొండి బకాయిల కింద చేర్చారు. ఏదైనా సర్వీస్‌కు సంబంధించి ఏడాదికి మించి బిల్లు చెల్లించనిపక్షంలో ఆ సర్వీస్‌ను బిల్ స్టాప్ కింద చేర్చుతారు. ఇలా డివిజన్‌వ్యాప్తంగా వీటికి సంబంధించి రూ.13.33 కోట్ల బకాయిలున్నాయి. అంటే మొత్తం బకాయిల్లో 33 శాతం వీటికి సంబంధించినవే. వీటిలో గృహ వినియోగ కనెక్షన్లు 14,018 ఉండగా, వీటి బకాయిలు రూ.10.07 కోట్లున్నాయి. మూడునెలలుగా బిల్లు చెల్లించనివారు 3,590 మంది ఉండగా, వీటికి సంబంధించి రూ.2.62 కోట్లు చెల్లించాల్సి ఉంది.

మండలాలవారీగా పరిశీలిస్తే..

భైంసా డివిజన్ పరిధిలో భైంసా పట్టణంతో పాటు భైంసా మండలం, కల్లూరు, కుభీర్, లోకేశ్వరం, ముధోల్, బాసర, తానూరు మండలాలున్నాయి. మండలాలవారీగా బకాయిలు పరిశీలిస్తే.. పట్టణంలో 23,711 కనెక్షన్లకు సంబంధించి రూ.6.76కోట్లు, రూరల్‌లో 16,423 కనెక్షన్ల బకాయిలు రూ.5.75కోట్లు, కల్లూరులో 15,438 కనెక్షన్ల బకాయిలు రూ.4.60 కోట్లు, కుభీర్‌లో 16,801 కనెక్షన్ల బకాయిలు రూ.4.86 కోట్లు, లోకేశ్వరంలో 17,200 కనెక్షన్ల బకాయిలు రూ.5.10 కోట్లు, ముధోల్‌లో 16,155 కనెక్షన్ల బకాయిలు రూ.4.71కోట్లు, బాసరలో 7,855 కనెక్షన్ల బకాయిలు రూ.2.67 కోట్లు, తానూరులో 12,823 కనెక్షన్లకు సంబంధించి రూ.5.05 కోట్ల బకాయిన్నాయి.

భైంసా డివిజన్‌లో కేటగిరీల వారీగా బకాయిలు

కేటగిరీ	కనెక్షన్లు	బకాయిలు (రూ.లక్షల్లో)
గృహాలు	84,631	1,680.03
వాణిజ్యం	10,116	497.68
పరిశ్రమలు	492	116.65
వ్యవసాయ	28,436	322.82
వీధిదీపాలు	2,141	1,189.08
ప్రభుత్వ కార్యాలయాలు	590	148.49
మొత్తం	1,26,406	3,954.75



సకాలంలో చెల్లించి సహకరించాలి

విద్యుత్ బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.25వేలకు పైబడి ఉన్న బకాయిలు ఏడీఈ పర్యవేక్షణలో, రూ.50వేలకు మించి ఉన్న బకాయిలను డీఈఈ పర్యవేక్షణలో వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సహకరించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ, భైంసా

వనరుల వినియోగంతో లాభాలు

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- వ్యవసాయ క్షేత్రం పరిశీలన



ఆకుకూరలు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ రూరల్: వనరులు ఉపయోగించుకుని సాగు చేస్తే రైతులకు అనేక లాభాలు కలుగుతాయని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్ సమీపంలోగల నిర్మల్ మండల సమీకృత వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల పంటలు, సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ విధానాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. సేంద్రియ విధానంలో ఐదంచెల వ్యవసాయ విధానం, కొరమీను చేపల పెంపకం, నాటుకోళ్ల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ విధానం రైతుల కోసం రూపొందించబడిందని తెలిపారు. 15వేల లీటర్ల సామర్థ్యంగల వృత్తాకార ట్యాంక్, ఆక్సిజన్ సరఫరా కోసం రింగ్ బ్లోవర్ సిస్టం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. చేప పిల్లలు పెరిగే వరకూ వాటికి ఫీడ్ సైకిల్స్, నీటి నాణ్యత నిర్వహణతో రక్షించుకోవాలని సూచించారు. ఈ ట్యాంక్‌లో నాలుగు నెలలు చేపపిల్లలు పెంచుకున్న తర్వాత పాండ్‌లోకి చేర్చుతామని తెలిపారు. ఒకే సంవత్సరంలో మూడు పంటల దిగుబడులు సాధించే అవకాశం సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ విధానం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. భూగర్భ జలాలు చేపల పెంపకానికి వాడిన తర్వాత నైట్రోజన్, అమ్మోనియా శాతం కలిగిన నీరు సేంద్రియ ఎరువుతో సమానమని తెలిపారు. ఈ నీటిని కూరగాయల పెంపకం, వరి సాగుకు ఉపయోగించడం ద్వారా యూరియా అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. ఎకరంలో సాగు చేస్తున్న తీగ, దుంప జాతులు, ఆకుకూరలు, ఔషధ గుణాల వట్టివేర్లు, పెసలు తదితర పంటలు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఆకుకూరలు కొనుగోలు చేశారు. డీఆర్డీవో విజయలక్ష్మి, అదనపు డీఆర్డీవో గోవింద్, ఎంపీడీవో సాయిరాం, ఏపీఎంలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పాల కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: సేకరణ సామర్థ్యానికి అనుగుణంగా పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లాలో పాల సేకరణ పెంచాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. గురువారం సోఫినగర్‌లోని విజయ డెయిరీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. పాల తయారీ కేంద్రంలోని వివిధ యంత్రాలు, పనితీరు పరిశీలించారు. జిల్లా పాల సేకరణ పరిశ్రమ వివరాలు ఉప సంచాలకుడు మధుసూదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని నిర్మల్, కడెం, దేగాం యూనిట్ల ద్వారా రోజుకు 6,500 లీటర్ల పాల సేకరణ జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా గిరిజన సభ్యులతో లవణ మిశ్రమం తయారీ, పాల ప్యాకింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో విజయ పాలు, పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని సూచించారు. గిరి విజయమిన్ లవణ మిశ్రమం విక్రయాలు పెంచాలని, పాడి రైతులకు దాణా, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేనేజర్ దస్రు నాయక్, రమణారెడ్డి, సాయన్న, సంతోష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతిని హేళన చేయడం తగదు



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్‌లో తృణమూల్, కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేసిన సందర్భంగా వారు భారత ఉపరాష్ట్రపతిని వ్యంగ్యంగా అనుకరిస్తూ చేపట్టిన కార్యక్రమాన్ని రాహుల్‌గాంధీ చిత్రీకరించడం రాజ్యాంగ విరుద్ధమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతో రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకున్న ఉపరాష్ట్రపతిని వ్యంగ్యంగా అవమానించడం జరిగిందని, ఇది దేశ ప్రజలకే అవమానమని భావిస్తూ గురువారం రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఇందుకు బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అయ్యన్నగారి రాజేందర్, జిల్లా ప్రధానకార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్‌నయన్, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీగాదె విలాస్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, శ్రీరామోజీ నరేశ్, నాయకులు సత్యనారాయణ, శ్రావణ్, ప్రకాశ్, జమాల్, కార్తిక్, దిలీప్, రంజిత్, వెంకట్, విఠల్, అజయ్, హనుమంతురాజ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ బర్త్‌డే జగన్ సార్..



కేక్ తినిపించుకుంటున్న అభిమానులు

నిర్మల్‌టౌన్: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలో గురువారం ఆయన అభిమానులు కేక్ కట్ చేశారు. మంజులాపూర్ 18వ వార్డు కౌన్సిలర్ పురాస్తు చిన్నయ్య, జగన్ అభిమాని శంకర్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ మళ్లీ గెలువాలని ఆకాంక్షించారు. కాలనీల్లో బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. దేవేందర్‌యాదవ్, స్వామి, పాండు, వినయ్, గంగాధర్, రంజిత్ ఉన్నారు

విలీన మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రంగారావు

నిర్మల్‌చైన్‌గేట్: విప్లవ పార్టీల విలీన మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 2024 మార్చి 3,4,5 తేదీల్లో మూడు విప్లవ పార్టీలు విలీనం కాబోతున్నాయని, విప్లవోద్యమ చరిత్రలో ఇదొక మంచి పరిణామమన్నారు. ఖమ్మంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కామ్రేడ్ కేజీ రాంచందర్, కామ్రేడ్ కే రమ, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు బక్కన్న, గంగన్న, రామ్‌లక్ష్మణ్, జగన్‌సింగ్, లక్ష్మి, మహేందర్, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

నిజాలు దాస్తున్నారెందుకు?



ఆర్టీఐ ద్వారా తీసుకున్న వివరాలతో కంపెనీ సీఈవోను నిలదీస్తున్న నవీన్

- ఇథనాల్ ప్రతినిధులపై ప్రశ్నల వర్షం కురిపించి ఉక్కిరిబిక్కిరి చేసిన ప్రజలు
- అవగాహన సమావేశంలో అధికారుల నిలదీత

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని గ్రామ పరిసరాల్లో చేపట్టిన ఇథనాల్ కర్మాగారంపై కొద్దిరోజులుగా నిరసన జ్వాలలు రేకెత్తుతున్నాయి. ఈ క్రమంలో రెండురోజులుగా దిలావర్‌పూర్‌తోపాటు గుండంపల్లి, తదితర గ్రామాల ప్రజలు ఆందోళనలో భాగస్వాములవుతూ కర్మాగారాన్ని నిలుపుదల చేసేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా గురువారం రాత్రి ఇథనాల్ కంపెనీ ప్రతినిధులు తమ ఫ్యాక్టరీ పూర్తిగా కాలుష్యరహితం అంటూ స్థానికులతో పోలీసుల సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఐ ద్వారా కంపెనీకి సంబంధించిన వివరాలు తీసుకుని అనుమతులు, తదితర విషయాలపై కంపెనీ సీఈవో మనోజ్ రూపానీతో చర్చించారు. ఈ సందర్భంగా కంపెనీ చూపించిన వివరాలు తమకు పొంతన లేవంటూ స్థానిక యువకులు కంపెనీ ప్రతినిధులపై తీవ్ర ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దీంతో చర్చలో పాల్గొన్న వారంతా వెనుదిరిగి పోయారు. కార్యక్రమంలో నిర్మల్ సీఐ శ్రీనివాస్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల కోఆర్డినేటర్‌గా స్వామి

ఆదిలాబాద్‌: రాష్ట్రస్థా యి ఎస్జీఎఫ్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల కోఆర్డినేటర్‌గా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్‌.స్వామి నియమితులయ్యారు. నిర్మల్‌లో గురువారం నుంచి ఈనెల 23 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఆయన సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. ఈమేరకు విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి ఈ సందర్భంగా స్వామిని అభినందించారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ


సందీప్‌తో అధికారులు

దస్తురాబాద్‌: హైదరాబాద్‌లో ఈనెల 18,19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్‌–19 కుస్తీపోటీల్లో మండలంలోని దేవునిగూడెంకు చెందిన తాటికొండ సందీప్‌ ప్రతిభ కనబర్చాడు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా తరఫున పాల్గొని సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట జ్యోతిబాపూలే కళాశాలలో చదువుతున్న విద్యార్థి జాతీయ పోటీలకు ఎంపికకావడంపై కుటుంబీకులు, జిల్లా విద్యాశాఖ, క్రీడా అధికారులు, కుస్తీ అసోసియేషన్‌ కార్యదర్శి చంద్రయ్య, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర హాకీ అసోసియేషన్‌లో జిల్లావాసికి చోటు

ఆదిలాబాద్‌: రాష్ట్ర హాకీ అసోసియేషన్‌లో జిల్లావాసికి చోటు దక్కింది. హైదరాబాద్‌లోని ఒలింపిక్‌ అసోసియేషన్‌ భవనంలో గురువారం రాష్ట్ర హాకీ అసోసియేషన్‌ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారధిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. జిల్లా హాకీ అసోసియేషన్‌ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌ రెడ్డి, కోశాధికారి డేవిడ్‌ రాజు ఆయన్ను అభినందించారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్‌: తన కుమారుడు ఎంబడి వంశీపై ఇటీవల దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మావలకు చెందిన ఎంబడి స్వామి డిమాండ్‌ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఖానాపూర్‌: మండలంలోని గోసంపల్లె గ్రామంలోని ఓ ఇంట్లో టేకు దశరథ్‌ అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌ బియ్యాన్ని రెండు రోజుల క్రితం పోలీసులు పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సీసీఎస్‌ పోలీసులకు అందిన సమాచారంతో మంగళవారం రాత్రి పట్టుకున్న సుమారు 35 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఖానాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. గురువారం డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కిరణ్‌కుమార్‌కు వాటిని అప్పగించామని ఎస్సై లింబాద్రి తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రాంనగర్‌ కాలనీకి చెందిన రాజమణి మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. తన ఇంటి ఎదుట కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు తన మెడలో బంగారు గొలుసు దొంగిలించుకెళ్లారని తెలిపింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొంది.

ఆర్టీసీ డ్రైవింగ్‌ స్కూల్‌లో అవకాశం

- అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం
- జనవరిలో శిక్షణ ప్రారంభం



శిక్షణ కోసం ఏర్పాటు చేసిన బస్సు

మంచిర్యాలఅర్బన్‌: రోజురోజుకు వాహనాల సంఖ్య అంతకంతకు పెరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రాబోయే రోజుల్లో ఆర్టీసీ మరిన్ని బస్సులు కొనుగోళ్లు చేసేందుకు కసరత్తు చేసింది. బస్సులు నడిపేందుకు డ్రైవర్లు తప్పనిసరి. ఇంకోవైపు నైపుణ్యం కావాలి. భారీ వాహనాలను నేర్చుకోవాలంటే ఎంతో కట్టుదిట్టమైన శిక్షణ అవసరం. వాహనాల డ్రైవింగ్‌ నేర్పించే సంస్థలు ఆడపాదడపా ఉన్నా నైపుణ్యత కల్గిన శిక్షకులు అంతంతే. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపోల్లో డ్రైవింగ్‌ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంచిర్యాలలో రెండేళ్ల క్రితం అనుమతులు లభించాయి. ప్రస్తుతం మరోమారు అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించింది. అనుకున్నమేర వారు ముందుకువస్తే ఆర్టీసీ మోటార్‌ డ్రైవింగ్‌ స్కూల్‌లో శిక్షణను జనవరిలో ప్రారంభించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు ప్రారంభించింది.

డ్రైవింగ్‌లో శిక్షణ ఇలా..

ఆర్టీసీలో డ్రైవింగ్‌ స్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కేంద్రం తెరిచి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థి రూ.15,500 వరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు పైబడినవారు మాత్రమే శిక్షణకు అర్హులు. అభ్యర్థులు శారీరక దారుఢ్యం కలిగి ఉండాలి. లైట్‌ మోటార్‌ వెహికల్‌ లైసెన్సులు పొంది తప్పనిసరిగా ఏడాది పూర్తయి ఉండాలి. డ్రైవింగ్‌ స్కూల్‌లో వెసులుబాటు బట్టి ఒక్కో అభ్యర్థి 36 రోజులు శిక్షణ ఇస్తారు. మొత్తం 16 గంటలు థియరీ తరగతులు, 20 గంటలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. నైపుణ్యత కల్గిన ఆర్టీసీ సీనియర్‌ డ్రైవర్లు ఈ శిక్షణ ఇస్తారు.

ప్రత్యేక వాహనంతో..

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్రైవింగ్‌ స్కూల్‌లో సీనియర్‌ డ్రైవర్ల ద్వారా అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. డ్రైవింగ్‌ స్కూల్‌కు కావల్సిన కండీషన్‌ వాహనం (ప్రత్యేక బస్సులు) ద్వారా డ్రైవింగ్‌ నేర్పించనున్నారు. వాహనంలో రెండు బ్రేక్‌లు, క్లచ్‌, ఎక్స్‌లేటర్‌, డ్రైవింగ్‌ శిక్షణ. ఇస్తారు. థియరీ బోధనకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం ద్వారా తర్ఫీదు ఇవ్వనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన డ్రైవర్లకు ఆర్టీసీ సంస్థలో మొదట ప్రాధాన్యత కల్పిస్తారు. అద్దె బస్సుల సంఖ్య పెరగడంతోపాటు సంస్థ ఆధ్వర్యంలో బస్సుల కొనుగోళ్లకు నిర్ణయించారు. లారీలు, ఇతర వాహనాలపై క్లీనర్‌గా వెళ్లి సొంతంగా వెళ్లి ఆడపాడదపా నేర్చుకుంటున్న డ్రైవింగ్‌లో అనుకున్న మేర నైపుణ్యత లేకపోవడం ..ఉపాధి అవకాశాలు కూడా తక్కువగానే ఉంటాయి.

జనవరిలో అభ్యర్థులకు పాఠాలు

డ్రైవింగ్‌ స్కూల్‌లో శిక్షణ ప్రారంభం కావాలంటే ఒక బ్యాచ్‌లో 16 మంది అభ్యర్థులకు అవకాశం ఉంది. వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆర్టీఏ నిబంధనల మేరకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశాం. శిక్షణ అవసరమైన ప్రత్యేక బస్సు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ముందుకు వస్తే డ్రైవింగ్‌స్కూల్‌ ప్రారంభిస్తాం. పూర్తి వివరాలకు ఆర్టీసీ డిపోలో సంప్రదించాలి.

– రవీంద్రనాథ్‌, డీఎం మంచిర్యాల

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- నేడు సెమీ ఫైనల్‌, ఫైనల్‌


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్‌: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి అండర్‌– 14 బాలబాలికల ఖోఖో పోటీలు ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నాయి. రెండోరోజు గురువారం గిరిజన బాలికల ఆదర్శ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల నుంచి 10 బాలుర, 10 బాలికల జట్లు తలపడ్డాయి. ఉదయం 10 గంటల నుంచి మొదలైన పోటీలు రాత్రి 8 గంటల వరకు రసవత్తరంగా సాగాయి. శుక్రవారం సెమీ ఫైనల్‌, ఫైనల్‌ పోరు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

రెండో రోజు పోటీలు ఇలా..

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో నల్గొండపై వరంగల్‌ జట్టు విజయం సాధించింది. అలాగే నిజామాబాద్‌ జట్టుపై కరీంనగర్‌, కరీంనగర్‌పై మెదక్‌, నల్గొండపై మహబూబ్‌ నగర్‌, హైదరాబాద్‌పై ఆదిలాబాద్‌, హైదరాబాద్‌పై నిజామాబాద్‌, వరంగల్‌పై రంగారెడ్డి, మెదక్‌పై ఆదిలాబాద్‌, ఖమ్మంపై మహబూబ్‌నగర్‌, హైదరాబాద్‌పై కరీంనగర్‌, నల్గొండపై రంగారెడ్డి, నిజామాబాద్‌పై మెదక్‌, మహబూబ్‌నగర్‌పై వరంగల్‌, హైదరాబాద్‌పై మెదక్‌, కరీంనగర్‌పై ఆదిలాబాద్‌ జట్టు గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో వరంగల్‌ జట్టుపై నల్గొండ జట్టు గెలుపొందగా.. రంగారెడ్డిపై ఆదిలాబాద్‌, కరీంనగర్‌పై ఖమ్మం, ఖమ్మంపై రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌పై మెదక్‌, నిజామాబాద్‌పై నల్గొండ, హైదరాబాద్‌పై ఖమ్మం, కరీంనగర్‌పై మహబూబ్‌నగర్‌, నిజామాబాద్‌పై ఆదిలాబాద్‌, వరంగల్‌పై రంగారెడ్డి, హైదరాబాద్‌పై మెదక్‌, నల్గొండపై రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌పై ఖమ్మం, నల్గొండపై ఆదిలాబాద్‌, వరంగల్‌పై నిజామాబాద్‌, హైదరాబాద్‌పై కరీంనగర్‌, ఖమ్మపై మెదక్‌ జట్టు విజయం సాధించాయి. కాగా.. ఒక్కో జట్టు ఐదు మ్యాచులు ఆడుతుంది. అందులో విజయం సాధించిన జట్లు క్వార్టర్‌ ఫైనల్‌కు చేరుతుంది. అక్కడ విజయం సాధించనవి సెమీస్‌, ఫైనల్‌లో తలపడతాయి. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్‌డీఎఫ్‌ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ఏసీఎంవో ఉద్ధవ్‌, కోచ్‌ విద్యాసాగర్‌, అరవింద్‌ పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆదిలాబాద్‌రూరల్‌: జిల్లాలోని బోథ్‌తోపాటు ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీ గా ఉన్న లైబ్రేరియన్‌ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ఇంటర్వ్యూలకు పలువురు అభ్యర్థులు హాజరయ్యారు. ఆర్‌సీవో స్వరూపరాణి మాట్లాడుతూ తాత్కాలిక ప్రతిపాదికన ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. 19 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 15 మంది డిప్లొమా చేసిన వారు, మరో నలుగురు రెగ్యులర్‌ సైన్స్‌ డిగ్రీచేసిన వారు ఉన్నారని పేర్కొన్నారు. ఎంపికైన వారి పేర్లను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

జాతీయ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కైలాస్‌నగర్‌: జిల్లా యువజన కాంగ్రెస్‌ నాయకులు గురువారం ఆ విభాగం జాతీయ అధ్యక్షు డు బీవీ. శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్‌, ఆదిలాబాద్‌ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, బోథ్‌ అసెంబ్లీ అధ్యక్షుడు పోతారెడ్డి ఢిల్లీలోని యువజన కాంగ్రెస్‌ కార్యాలయంలో ఆయనను కలిశారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు, యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో చే పట్టిన కార్యక్రమాలను ఆయనకు వివరించారు.

మున్సిపల్‌ అధికారులకు మెమోల జారీ

- సమయపాలన పాటించాలని కమిషనర్‌ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్‌


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్‌

కైలాస్‌నగర్‌: మున్సిపల్‌ అధికారులు సమయపాల న పాటించకుంటే చర్యలు తప్పవని కమిషనర్‌ ఏ.శైలజ అన్నారు. 'అస్తవ్యస్తంగా బల్దియా పాలన 'శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. అన్ని విభాగాల అధికారులు, కీలకమైన కార్యాలయ ఉద్యోగులతో తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన ఆమె పలు విభాగాల అధికారులకు మెమోలు జారీచేశారు. ప్రతి విభాగం అధికారి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఈ తిరుపతి, ఏఈ అరుణ్‌ కుమార్‌, రెవెన్యూ అధికారి జాదవ్‌ కృష్ణ, టీపీఓ అనురాధ, టీపీఎస్‌ సాయికుమార్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బ్రహ్మానంద్‌

గుడిహత్నూర్‌: మండలంలోని డొంగర్‌గావ్‌లో గురువారం షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. కాలనీవాసులు విద్యుత్‌ అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేశారు. తాళం పగులగొట్టి మంటలార్పుతుండగా అప్పటికే ఫర్నిచర్‌, మంచం, బీరువాలోని దుస్తులు, టీవీ, కంప్యూటర్‌, ప్రింటర్‌ దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకుని బాధితురాలు దోమకొండ సుధాకర్‌ భార్య సునీత(ఆశవర్కర్‌) బోరున విలపించింది. ఇంట్లోని ఫ్రిడ్జ్‌లో జరిగిన షార్ట్‌ సర్క్యూట్‌ ప్రమాదానికి కారణమైనట్లు గుర్తించారు. ఆర్‌ఐ అరుణ్‌ వివరాలు సేకరించి రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్‌, మాజీ సర్పంచ్‌ ప్రతాప్‌ బాధితురాలిని పరామర్శించారు. మాజీ సర్పంచ్‌ తక్షణసాయం రూ.2 వేలు అందించారు.

పరీక్షకు వచ్చి..అనంతలోకాలకు

- నాగుగూడ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్‌
- విద్యార్థి మృతి, మరో స్నేహితుడికి గాయాలు

బోథ్‌: డిగ్రీ పరీక్ష రాయడానికి వచ్చి విద్యార్థి అనంతలోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని నాగుగూడ వద్ద బుధవారం రాత్రి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌ ఢీకొన్న ఘటనలో విద్యార్థి మృతిచెందగా మరో స్నేహితుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై రాము కథనం ప్రకారం.. బజార్‌హత్నూర్‌ మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తొడసం రాహుల్‌ (21) బోథ్‌లోని ఓ కళాశాలలో బుధవారం డిగ్రీ పరీక్ష రాశాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై స్నేహితుడు జుగ్నక్‌ సంతోష్‌ను ఘన్‌పూర్‌లో దింపడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి నాగుగూడ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాహుల్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన సంతోష్‌ను స్థానికులు 108లో బోథ్‌ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్‌ రిమ్స్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదంలో రాహుల్‌ మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడు రాహుల్‌ తండ్రి రాజేశ్వర్‌ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇచ్చోడ: రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఎస్సై నరేశ్‌ ప్రకారం.. మండలంలోని నర్సాపూర్‌కు చెందిన బొనగిరి అడెల్లు (41) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి రాజన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

సారంగపూర్‌: మండలంలోని స్వర్ణ–కౌట్ల(బి) గ్రామ సమీపంలోని పొలంలో ఒకరు పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై వసంత్‌ కథనం ప్రకారం..మహారాష్ట్రలోని కిన్వట్‌ తాలూకా నంద్‌గాం గ్రామానికి చెందిన టర్పె తుక్కారాం(35) సోన్‌ మండలంలోని బొప్పారానికి చెందిన పెద్దోళ్ల గంగారెడ్డి వద్ద పాలేరుగా పనిచేసేవాడు. ఆయన మద్యానికి బానిసయ్యాడు. కొన్నిరోజులుగా తాగిన మత్తులో ఇష్టారీతిన తిరుగుతూ ఉండేవాడు. ఈక్రమంలో స్వర్ణ గ్రామానికి చేరుకున్న ఆయన మద్యం మత్తులో కౌట్ల(బి)– స్వర్ణ గ్రామ మధ్యలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతులు సమాచారం అందించడంతో ఏఎస్సై ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య సవిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'ఉపాధి' ప్రణాళికపై కసరత్తు

- ఉమ్మడి జిల్లాలో 2024–25 పనుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- నీటి అభివృద్ధి పనులకే అధిక ప్రాధాన్యం


కోటపల్లిలో ఈజీఎస్‌ గ్రామసభలు

కోటపల్లి: వలసల నివారణకు అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 సంవత్సరానికి గాను పనుల గుర్తింపు ప్రక్రియ ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఈ నెల 30లోగా సంబంధిత నివేదికలు ఉన్నతాధికారులకు అందించాల్సి ఉంది. ప్రస్తుత సంవత్సరంతో పోలిస్తే రానున్న ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌ ఒకటి నుంచి మార్చి 31వరకు కూలీలకు పూర్తి స్థాయిలో పని కల్పించడమే కాకుండా నీటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికల రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. గత వారం రోజులుగా ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు గ్రామాల్లో పనులు గుర్తిస్తున్నారు. పనుల గుర్తింపునకు మంచిర్యాల జిల్లాలో గతంలోనే గ్రామసభలు నిర్వహించారు.

80శాతం పనులు పూర్తి...

ప్రస్తుత సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో 5,84,039 జాబుకార్డులు ఉండగా, 11,53,949మంది కూలీలకు గాను 4,663మంది కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. సుమారు రూ.40కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. భూమి అభివృద్ధి పనులు, ఊరచెరువులు, పూడికతీత పాంపాండ్స్‌ నిర్మాణాలు, చిన్ననీటి కుంటలు, ఇంకుడుగుంతల నిర్మాణాలు, హరితాహారం, వ్యవసాయ క్షేత్రాలకు రహదారులు, కందకాలు, వాలుకట్టలు, హరితహారం, ఇంకుడుగుంతలు, ముళ్లపొదలు తొలగింపు తదితర పనులున్నాయి. సుమారు 80శాతం వరకు పనులు చేపట్టినట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గతేడాది కంటే అధికంగా పనులు గుర్తించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, పౌరుల భాగస్వామ్యంతో ఎక్కువమందికి పని కల్పించేలా చూడాలని ఆదేశించారు. ఈ పనులపై గ్రామసభలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటివరకు గుర్తించిన పనులను ఆన్‌లైన్‌ నమోదు చేయగా గ్రామాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ ఆమోదం తదుపరి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారు.

జిల్లాలు	జాబ్‌కార్డులు	కూలీలు	వందరోజులు చేసిన కుటుంబాలు
మంచిర్యాల	120926	237682	479
ఆదిలాబాద్‌	169755	341474	707
నిర్మల్‌	172017	330528	2636
కుమురంభీం	121341	244265	841



ప్రతీ కూలీకి పని కల్పించడమే లక్ష్యం...



ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో పని అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం. వచ్చే ఏడాది మార్చి నుంచి పూర్తిస్థాయిలో ఉపాధి పనులు ప్రారంభించనున్నాం. దీనికి సంబంధించి కార్యాచరణ తయారు చేస్తున్నాం. వచ్చే ఏడాది అడిగిన వారందరికీ పని కల్పించడమే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో పనులు గుర్తిస్తున్నాం.

– శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖమంచిర్యాల

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



సారంగపూర్‌: మండలంలోని ఆలూరు ఎక్స్‌ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. జామ్‌ గ్రామానికి చెందిన పాల నర్సయ్య, భోజన్నలు నిర్మల్‌ నుంచి జామ్‌వైపు బైక్‌పై వస్తున్నారు. ఇదే సమయంలో ఆలూరు గ్రామంలో కూరగాయలు విక్రయించి తన స్వగ్రామమైన చించోలి(బి)కి వెళ్తున్న ప్రసాద్‌ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌ సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు ఇన్‌చార్జి ఎస్సై వసంత్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సై మనోహర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా లింగాపూర్‌ మండలం మోతిపటార్‌ గ్రామానికి చెందిన రాథోడ్‌ సచిన్‌ డిగ్రీ పరీక్ష రాయడానికి ఉట్నూర్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాథోడ్‌ సచిన్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఉట్నూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్‌ రిమ్స్‌కు రెఫర్‌ చేశారు.

ముగిసిన హనుమాన్‌ జాతర


జాతరలో భక్తుల సందడి

తానూరు: మండలంలోని బోరిగాం హనుమాన్‌ ఆలయంలో 20వ వార్షికోత్సవ సందర్భంగా గత రెండురోజులుగా కొనసాగుతున్న జాతర ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ జాతరకు గ్రామాలతోపాటు మహారాష్ట్రలోని ధర్మాబాద్‌, భోకర్‌ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన దుకాణాల్లో చిన్నాపెద్దలు సందడి చేశారు. రంగులరాట్నాలు, గుర్రపు బగ్గీలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎస్సై సందీప్‌ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంత్రరాష్ట్ర మల్లయోధులకు కుస్తీపోటీలు

జాతర సందర్భంగా అంత్రరాష్ట్ర మల్లయోధులకు గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన రాజునిలా ప్రథమ స్థానంలో నిలిచాడు. రూ.7,051 నగదుతోపాటు వెండి కడియం బహూకరించి ఆయన్ను సన్మానించారు. వైస్‌ ఎంపీపీ జిల్లావార్‌ చంద్రకాంత్‌, మాజీ కోఆప్షన్‌ సభ్యుడు చంద్రకాంత్‌, నాయకులు గంగాధర్‌, బాలాజీ, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదల, కార్మికుల హక్కుల కోసం నిత్యం పోరాడడానికి సీపీఐ ముందుంటుందన్నారు. దశాబ్దాలుగా అన్నదాతల హక్కుల కోసం ఉద్యమించిందన్నారు. డిసెంబర్‌ 26 నుంచి 99వ వడిలోకి పార్టీ అడుగుపెడుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్‌, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు షేక్‌ పాషా, సత్యనారాయణ, అమీనా బేగం, దళిత సంఘం జిల్లా అధ్యక్షుడు రాందాస్‌, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గణేశ్‌, పార్టీ నాయకులు బుర్రి సత్వాజి, బెజ్జంకి నర్సింగరావు బత్తుల గంగారెడ్డి, స్వామి పాల్గొన్నారు.